క్లుప్తంగా

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 నుంచి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు.

పోషకాహారంతో తల్లీబిడ్డ ఆరోగ్యం



స్టాల్స్ పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

పరవాడ: పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి తెలిపారు. వెన్నెలపాలెం ఓల్డ్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషకాహార మాసోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్న ఫుడ్ స్టాల్స్ ప్రాముఖ్యతను తల్లులు, గర్భిణులు, బాలింతలకు వివరించారు. చిన్నతనంలో తల్లి పాల ప్రాధాన్యతతో పాటు ఇంటి పరిసరాల్లో మొక్కల పెంపకం గురించి తెలిపారు. అంతర్జాతీయ కిశోర బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 12న పరవాడ బాలికల జెడ్పీ హైస్కూల్లో కిశోర బాలికలకు ఆటల పోటీలు నిర్వహించి, అదే రోజు విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ, పట్టుదల ఉంటేనే అవకాశాలు



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఎల్లాజీ

పెందుర్తి: ప్రతిభ కలిగి, సాధించాలనే పట్టుదల ఉన్నవారికి సినిమా, సీరియల్, షార్ట్‌ఫిల్మ్ రంగాల్లో అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని వైజాగ్ షార్ట్‌ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ కార్యదర్శి, డైరెక్టర్ ఎల్లాజీ అన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో ఫిల్మ్ మేకింగ్‌పై బుధవారం ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లాజీ మాట్లాడుతూ అవకాశాలకు ప్రతిభే కొలమానం అని స్పష్టం చేశారు. పలు విభాగాల్లో రాణించాలనుకునే వారికి తగిన సూచనలు, సలహాలు అందించారు. షార్ట్‌ఫిల్మ్ హీరో కుమార్‌రాజు విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్ నూతన ఏడీఆర్‌ఎంగా రామారావు



తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ నూతన అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్‌గా కుందు రామారావు నియమితులయ్యారు. శ్రీకాకుళం జిల్లా, పలాసకు చెందిన ఆయన 2002లో ఆంధ్రా యూనివర్సిటీలో బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ప్రజాసేవపై గల ఆసక్తితో 2006లో ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీసెస్ పరీక్ష రాసి, ఆలిండియా 44వ ర్యాంకు సాధించి రైల్వేలో చేరారు. పలు జోన్లలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్‌గా, సీనియర్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్‌గా, సీనియర్ డివిజనల్ ఇంజినీర్‌గా, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్‌గా పని చేశారు. జపాన్‌లో నిర్వహించిన ప్రత్యేక శిక్షణలో కూడా ఈయన పాల్గొన్నారు. తన సేవలకు గాను ప్రతిష్టాత్మక జనరల్ మేనేజర్ అవార్డును 2010లో అందుకున్నారు.

ఆలయ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నేత విరాళం

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు కణితి నిర్వాసిత కాలనీ రామాలయం వద్ద చేపట్టిన పంచ ముఖేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొడ్డ గోవింద్, దివ్యభారతి దంపతులు రూ.1,00,159 విరాళం అందించారు. ఆలయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ప్రగడ శ్రీనివాస రావు, దుగ్గపు దానప్పలు, బొడ్డ సన్యాసిరావు, ప్రగడ గోవిందరాజులు, ప్రగడ శంకరరావు, పూడి శ్రీనివాస్, కొన్నా నారాయణ పాల్గొన్నారు.

జననేత రాక కోసం..
ఉత్సాహంగా జనం

- ఎన్నికల తర్వాత తొలిసారి పెందుర్తికి మాజీ సీఎం వైఎస్ జగన్
- నేడు ఉదయం 10.30కు ఆర్ఆర్ వెంకటాపురం వద్ద నియోజకవర్గంలోకి అడుగు
- వేపగుంట, సుజాతనగర్ మీదుగా పెందుర్తి నాలుగు రోడ్ల కూడలికి రాక
- అభిమాన నేతకు స్వాగతం పలికేందుకు భారీగా తరలిరానున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు
- జనం రాకను అడ్డుకునేందుకు అడుగడుగునా కూటమి కుతంత్రం!



రోడ్డు మార్గాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా పరిశీలకురాలు శోభా హైమావతి, అదీప్‌రాజ్, జయరామ్, గండి రవి, దేవిసాంబ, కొటాన రాము



పెందుర్తిలో రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తలశిల రఘురాం, జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

2024 సార్వత్రిక ఎన్నికల ప్రచార సభ అనంతరం దాదాపు ఏడాదిన్నర తర్వాత తమ అభిమాన నాయకుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గంలోకి రానుండడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు ఆయన అభిమానులు, ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అడుగడుగునా ఘన స్వాగతం పలికేందుకు, కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనపై మొరపెట్టుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. అయితే జనాల్ని జగన్ వద్దకు చేరనీయకుండా కూటమి ప్రభుత్వం పోలీసుల సాయంతో అన్ని విధాలా కుట్రలు, కుయుక్తులకు తెరలేపింది. అయినప్పటికీ తగ్గేదే లే.. అంటూ పార్టీ శ్రేణులు, అభిమానులు ఉత్సాహంగా ఉన్నారు.

పెందుర్తి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక సందర్భంగా పెందుర్తి నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులు, అభిమానులు ఘన స్వాగతం పలికేందుకు సన్నద్ధమయ్యారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని మెడికల్ కళాశాల సందర్శనకు వెళ్లనున్న వైఎస్ జగన్ ఉదయం 10.30 సమయంలో ఆర్ఆర్ వెంకటాపురం వద్ద పెందుర్తి నియోజకవర్గంలోకి ప్రవేశించనున్నారు. నాయుడుతోట, వేపగుంట కూడలి, పురుషోత్తపురం, సుజాతనగర్, చినముషిడివాడ, పెందుర్తి జూనియర్ కళాశాల మీదుగా పెందుర్తి నాలుగు రోడ్ల కూడలికి అధినేత కాన్వాయ్ చేరుకుంటుంది. అక్కడి నుంచి జాతీయ రహదారి–16 మీదుగా అనకాపల్లి చేరుకోనున్నట్లు పార్టీ శ్రేణులు వెల్లడించాయి.

జననేతపై తరగని అభిమానం

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ఐదేళ్లపాటు అనేక సంక్షేమ పథకాల రూపంలో రూ.వందల కోట్లు లబ్ధిని నియోజకవర్గ ప్రజలకు చేకూర్చారు. అమ్మ ఒడి, రైతు భరోసా, జగనన్న కాలనీలు, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, ఆటో కార్మికులకు వాహన మిత్ర వంటి అనేక సంక్షేమ పథకాలతో ఏటా వేలాది మందిని ఆదుకున్నారు. మరోవైపు భారీ మొత్తంలో నిధులు కేటాయించి పెందుర్తి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. దీంతో పార్టీ కార్యకర్తలతో పాటు సాధారణ ప్రజలు కూడా వైఎస్ జగన్ అభిమానులుగా మారారు. నియోజకవర్గ కేంద్రానికి వైఎస్ జగన్ రాక సందర్భంగా తమ అభిమానాన్ని చాటుకునేందుకు వీరంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

జనాన్ని అడ్డుకునేందుకు కుట్రలు

జననేత జగన్ పర్యటన ముందుగా నగరంలోని ఎయిర్‌పోర్టు నుంచి గాజువాక, లంకెలపాలెం మీదుగా అనకాపల్లి వెళతారనుకున్నారు. అయితే బుధవారం ఉదయం ఆయన పర్యటన రూట్ మ్యాప్ పూర్తిగా పూర్తిగా మారిపోయింది. ఈ క్రమంలో ఎయిర్‌పోర్టు నుంచి పెందుర్తి కూడలి వరకు భారీగా జనాలు వచ్చే అవకాశం ఉండడంతో కూటమి ప్రభుత్వం ప్రజలను అడ్డుకునేందుకు కుట్రలు, కుయుక్తులు మొదలెట్టింది. పెందుర్తి గ్రామీణ, పట్టణ ప్రాంతంతో పాటు సబ్బవరం, పరవాడ నుంచి వేలాదిగా జనాలు వచ్చే అవకాశం ఉండడంతో పోలీసుల సాయంతో ఎక్కడికక్కడ ముఖ్యనాయకుల గృహనిర్బంధాలకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే పలుచోట్ల అనధికారికంగా ఆటో డ్రైవర్ల సమావేశం ఏర్పాటు చేసిన పోలీసులు జనాలను పెందుర్తికి తీసుకురావద్దని.. తీసుకువస్తే కేసులు పెడతామని హెచ్చరికలు జారీ చేశారు. ఇతర ప్రైవేటు వాహనాల యజమానులను కూడా వైఎస్ జగన్ పర్యటనకు ప్రజల్ని తీసుకెళ్లొద్దంటూ హెచ్చరించినట్లు సమాచారం. గ్రామాల్లో మహిళలను నియంత్రించేందుకు డ్వాక్రా(వెలుగు) అధికారులను, సిబ్బందిని పురమాయించారు.

పరవాడ నుంచి తరలి రండి..

పరవాడ: నర్సీపట్నం దరి మాకవరపాలెంలోని మెడికల్ కళాశాలను సందర్శించడానికి రోడ్డు మార్గాన వెళుతున్న రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు తరలి రావాలని పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు బుధవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గురువారం ఉదయం 10 గంటలకు పెందుర్తి నాలుగు రోడ్ల కూడలికి చేరుకోవాలని కోరారు.

అన్ని దారులూ పెందుర్తి వైపే..



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటనను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదు. చివరకు అనుమతి ఇవ్వక తప్పని పరిస్థితిలో పోలీసులు రూట్‌మ్యాప్‌ను ఇష్టానుసారంగా మార్చేశారు. ఎయిర్‌పోర్టు నుంచి వేపగుంట, సుజాతనగర్ మీదుగా వైఎస్ జగన్ పెందుర్తి నాలుగు రోడ్ల కూడలికి చేరుకుంటారు. పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలంతా పెందుర్తి కూడలి వద్దకు చేరుకుని జననేతకు ఘన స్వాగతం పలకాలని కోరుతున్నాం.

– అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

వేంకటాద్రిపై ప్రత్యేక పూజలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: చాతుర్మాస్య దీక్షలో భాగంగా స్థానిక వేంకటాద్రిపై బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో సుందరకాండ హవనం చేశారు. అనంతరం శ్రీనివాస నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. ముందుగా స్వామివారికి గోత్రనామార్చనలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

సందడిగా జాతీయ బాలికా దినోత్సవం



వాడచీపురుపల్లి జెడ్పీ హైస్కూల్లో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పరవాడ: మండలంలోని వాడచీపురుపల్లి జెడ్పీ హైస్కూల్లో సబ్బవరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రామ సచివాలయం –1, 2 ప్రాంతాల్లో ఈ వేడుకలను జరిపారు. పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పలు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణి, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

పరవాడ: జాతీయ కిశోర బాలికల దినోత్సవంలో భాగంగా నాయుడుపాలెం సచివాలయం పరిధి మెట్టపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు బుధవారం ఆటల పోటీలు, సైబర్ నేరాలు, రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. విజేతలకు ఈ నెల 12న బహుమతులు అందించనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణి తెలిపారు. కార్యక్రమంలో నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప మండల దీక్షలు ప్రారంభం





అయ్యప్పకు అభిషేకాలు చేస్తున్న దృశ్యం, మండల దీక్ష మాలలు వేస్తున్న గురుస్వామి చంద్రశేఖర్‌రెడ్డి

పెందుర్తి: సుజాతనగర్‌లోని పూర్ణ పుష్కళ సమేత శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, గురుస్వామి డాక్టర్ వాకా చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా అయ్యప్పకు విశేష అభిషేకాలు జరిపారు. అనంతరం మండల దీక్షాపరులకు అయ్యప్ప మాలధారణ చేయించారు. స్వామికి విశేష పూజలు జరిపి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ఘనంగా దుర్గాదేవి సారె ఊరేగింపు



అమ్మవారి సారెతో గండి రవికుమార్, గ్రామ పెద్దలు

సబ్బవరం: మండలంలోని మొగలిపురంలో దుర్గాదేవి సారె ఊరేగింపు బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీవీరాంజనేయస్వామి యూత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్, స్థానిక నాయకులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆయన వెంట సారె ఊరేగింపులో ఉప సర్పంచ్ సిరపరపు వాసు, పార్టీ నాయకులు యడ్ల నాయుడు, గ్రామ పెద్దలు గండి ముత్యాల నాయుడు, పైల రామునాయుడు, గండి సురేష్, వీరాంజనేయ యూత్, అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

చిన్నపాటి వర్షానికీ రోజుల తరబడి తిప్పలు



తాడి మూడు మదుముల వద్ద గెడ్డలో ప్రవహిస్తున్న ఊటనీరు



తాడి రైల్వే వంతెన కింద చేరిన వర్షపు నీరు

పరవాడ: తాడి మూడు మదుముల వద్ద గెడ్డ పరుజు పైనుంచి నిత్యం ప్రవహిస్తున్న వర్షపు నీటితో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఏ మాత్రం వర్షం పడినా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వర్షపు నీరు ఇక్కడ రోడ్డుపై పరుజు మీదుగా ప్రవహిస్తోంది. వర్షం ఆగిపోయినా నిత్యం ఊట కారణంగా రోజుల తరబడి తాడి, చిన తాడి, పెదతాడి గ్రామాల ప్రజలతో పాటు ఫార్మాసిటీలో పనిచేస్తున్న కార్మికులు తరచూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు పడుతున్న సమయంలో ఈ రహదారి మీదుగా ఫార్మాసిటీ, తాడి గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. పరుజు పైనుంచి ప్రవహిస్తున్న నీటిలో ద్విచక్ర వాహనాలు పూర్తిగా మునిగిపోతుండటంతో తరచూ రిపేర్లకు వస్తున్నాయని వాపోతున్నారు. తాడి శివారు గ్రామాల్లో అత్యవసర పరిస్థితుల్లో లంకెలపాలెం, అనకాపల్లి, గాజువాక ప్రాంతాల్లోని ఆస్పత్రులకు చేరుకోవాలంటే నాలుగైదు కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. తమ ఇబ్బందుల్ని గుర్తించి ఇక్కడ పరుజు వద్ద రోడ్డును ఎత్తు చేసి వర్షపు నీరు దిగువ నుంచి ప్రవహించడానికి వీలుగా పైపులను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థుల స్థాయికి తగ్గట్లు బోధించాలి

నూతన ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో అల్లూరి కలెక్టర్ దినేష్‌కుమార్



శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న అల్లూరి కలెక్టర్ దినేష్‌కుమార్

సబ్బవరం: ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులుగా ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకుంటూ, విద్యార్థుల స్థాయికి తగ్గట్లు బోధన చేసి, వారిని బాధ్యతాయుత పౌరులుగా తయారు చేసేందుకు కృషి చేయాలని అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో డీఎస్సీ–2025లో ఎంపికైన ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఇండక్షన్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. నూతన ఉపాధ్యాయులకు ఏ విధంగా శిక్షణ అందిస్తున్నారో తెలుసుకుని, బోధనలో అవలంభించాల్సిన పద్ధతులను సూచించారు. విద్యార్థుల స్థాయికి తగ్గట్లు బోధన చేయాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో ప్రదర్శించిన టీఎల్‌ఎం ప్రాజెక్టులను పరిశీలించారు. ముందుగా వర్సిటీ ఉపకులపతి కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానించారు. వర్సిటీలో కొత్తగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దామోదరం సంజీవయ్య, మహాత్మా గాంధీ విగ్రహాలను సందర్శించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులను సూచించారు. కార్యక్రమంలో డీఈవో గిడ్డి అప్పారావునాయుడు, ఏపీసీ డాక్టర్ ఎ.అప్పలనాయుడు, అల్లూరి జిల్లా డీఈవో బ్రహ్మాజీ, ఏఎంవో కెజియా, కోర్సు డైరెక్టర్ సింహాచలం తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, ఎంఈవో రవీంద్రబాబు, ట్రైనీలు, డీఆర్పీలు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతులు మంజూరు చేయొద్దు

కూర్మన్నపాలెం: అంబూజీ సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతులు మంజూరు చేయవద్దని కోరుతూ 86వ వార్డు వుడానగర్ ఫేజ్–1 రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పెదగంట్యాడ తహసీల్దార్ అమలకు వినతిపత్రం అందజేశారు. సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే గాజువాక ప్రాంతం దుమ్ము ధూళితో నిండిపోయి ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని అసోసియేషన్ అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు వివరించారు. ఇప్పటికే వివిధ పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్యం వల్ల ప్రజలు అనేక ఇబ్బంది ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమ ఏర్పాటు అయితే ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని కూడా ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పలువురు కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

'జీఎస్టీ ప్రయోజనాలపై అవగాహన అవసరం'



జీఎస్టీ సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వినోద్‌బాబు



సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జీఎస్టీపై అవగాహనా ర్యాలీ ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ పి.శిరీషరాణి తదితరులు

పరవాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్టీ 2.0 ప్రయోజనాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించేందుకు విద్యార్థులు కృషి చేయాలని పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వినోద్‌బాబు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సూపర్ జీఎస్టీ 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. జీఎస్టీ అమలు తీరుతెన్నులను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు లక్ష్మి, కుమారి, కల్యాణి, సత్యనారాయణ, ఉషాకుమారి, లక్ష్మీకాంతం, శేఖర్ బాబు, పద్మ, దివ్య, ఈశ్వరరావు పాల్గొన్నారు.

సబ్బవరం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్ కార్యక్రమంపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.శిరీషరాణి ఆధ్వర్యంలో భారీ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో తీసుకొచ్చిన సవరణలతో అధిక శాతం జీఎస్టీ తగ్గిన వస్తువుల గురించి వివరించారు. అనంతరం కళాశాలలో విద్యార్థులకు మానవ వనరుల అభివృద్ధి–సాధికారతపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలు జరిపారు. విజేతలకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎ.జనార్దనరావు, పి.సుభాషిణి, ఎస్‌వీఎల్‌ఎన్ ఉదయకుమార్, బి.గోవిందరావు, ఎస్ శ్రీనివాసరావు, సీహెచ్ వరప్రసాద్, బి.బాపునాయుడు, పి.రాణి, అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.